REGD NO- A 81.

విడి ప్రతి 0-20 న. పై.

13-12-63 శుక్రవారం

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 35 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 50

## ఇందిరమ్మకు డాక్టరు పట్టా

ఈ సారి స్నాతకోత్సవానదిచ్చిన శ్రీమతి ఇందిరాగాంధీగారికి ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరు పట్టంఇచ్చి గౌరవించింది. ఈ సందర్భంలోనే శ్రీమతి దుర్గాబాయమ్మ గారికికూడా డాక్టరేట్ ప్రసాదించబడింది. రాత్రి పగలు కష్టపడి శ్రమించేవానికంటే, రాజకీయాలలో ప్రవేశిస్తే సులభంగా "డాక్టర్" అని పించుకోవచ్చునే మోనపడిపిస్తున్నది.




# 50 లక్షల విలువగల ధాన్యానికి దిగ్బంధనం!

## బియ్యంధర తగ్గలేదు : చౌకడిపోలన్నీ ఇంకా ప్రారంభం కాలేదు

### 1000 టన్నుల మొలగొలుకుల బియ్యం కేటాయింపు: చౌకడిపోలు సహకార సంస్థలకు అప్పగింత

పెరిగిపోయినధరలను అదుపులో పెట్టుటకు ఆంధ్రప్రభుత్వం నెల్లూరుజిల్లా నుండి ధాన్యం, బియ్యం రవాణాను తాత్కాలికంగా నిషేధించింది. 8 తేదినుండి అమలులోకివచ్చిన ఈ వుత్తరువు ఈ నెలా ఖరువరకు అమలులోవుంటుంది. అవసరమనిభావిస్తే ఈ నిషేధాన్ని మరికొంత కాలంగూడా పొడిగిస్తామని వ్యవసాయ మంత్రిగారు ప్రకటించారు.

నెల్లూరులో ఈ సంవత్సరం పెరిగినంతగా ధాన్యంధరలు ఒక్కసారి ఎప్పుడూ పెరగలేదు. అందువల్లనే ఆంధ్రశాసనసభలోగాని, ఇతరత్రాగాని ఈ పర్యాయం జరిగినంత ఆందోళనగూడా మున్నెన్నడూ జరగలేదు. ధరల విపరీతపు పెరుగుదలను గూర్చి శాసనసభలో ఒకటికి మూడుపర్యాయములు ప్రస్తావించి, ప్రభుత్వాన్ని కదలించి, సత్వరచర్యలు గైకొంగుటకు దోహద



నెల్లూరుధాన్యంధరల పెరుగుదల నరికట్టుటకు సత్వర చర్యలు తీసుకున్న వ్యవసాయమంత్రి

**శ్రీ బలరామరెడ్డి**

మిచ్చిన నెల్లూరు శాసనసభ్యుడు శ్రీ ఎ.సి. కొండయ్య అభినందనీయుడు.

ధాన్యంగాని, బియ్యంగాని గతంలో యితరరాష్ట్రాలకు రవాణా నిషేధింపబడిందిగాని; ఒకేఒకజిల్లానుండి నిషేధింపబడటం యిదివరకెన్నడూలేదు. రవాణా నిషేధంవల్ల ధరలు తప్పక తగ్గవలసి వుంది. ప్రభుత్వం ఆ వుద్దేశ్యంతోనేచేసింది, అది ప్రశంసనీయంగూడా. ఈ వుత్తరువును కఠినంగా అమలుజరుపుటకు కలెక్టరు ద్వారా అవసరచర్యలు తీసుకున్నదిగూడా. ఇప్పుడుండే చెక్‌పోస్టులుగాక మరోకబదు తనిఖీకేంద్రాలు నెలకొల్పబడినవి; ప్రతి తనిఖీకేంద్రానికి ఒక పోలిస్ సబ్‌ఇన్‌స్పెక్టరు సహాయంగూడావుంటుంది. రివిన్యూ అధికార్లనుగూడా అప్రమత్తంగా వుండవలసిందిగా కలెక్టరుగారు ఆదేశించారని తెలుస్తున్నది. అందువల్ల అధికార్లకుసంబంధించినంతవరకు ఏర్పాట్లు కట్టుదిట్టంగావున్నట్లే భావించవచ్చు.

#### దొంగరవాణాకు అవకాశాలున్నాయి

అయితే, దీనివల్లనే రవాణా ఆగిపోతుందా? ధరలుతగ్గుతాయా? అనేది ప్రశ్న. కంట్రోలురోజులనాటి అనుభవాన్ని పురస్కరించుకొని, ఎన్ని నిర్బంధాలుపెట్టినా, రవాణా దొంగదాటుగాజరిగే అవకాశాలు వుండకపోవంటారు. అదీగాక, ఒక్క నెల్లూరుజిల్లానుండిమాత్రం రవాణా నిషేధింపబడిందిగాని, గుంటూరు వగైరా జిల్లాలకు ఈ నిషేధం వర్తించనందువల్ల; నెల్లూరుజిల్లానుండా ఆ జిల్లాల బియ్యం రవాణా సాగుతున్నందువల్ల, ఆపేరుతో నెల్లూరు మొలగొలుకులబియ్యంగూడా జిల్లా దాటిపోయ్యే అవకాశాలు వుండవచ్చునంటారు. మొలగొలుకులు నెల్లూరుజిల్లాలోనేగాక, గుంటూరుజిల్లాలోని కొన్నిప్రాంతాలలోగూడా పండుతున్నవి. ఈ కారణం

—కొరవ 7-వ పేజీలో

ఉచితం! ★ ఊరకే!!

## ఒక చేతిగుడ్డ - ఒక బొమ్మక్యాలెండరు

ఒక డజను అసార్టెడ్ కేకుల కొను ప్రతిఒక్కరికీ యివ్వబడును

క్రిస్‌మస్ -
క్రొత్తసంవత్సరం -
సంక్రాంతి -

పండుగల పురస్కరించుకొని ఆకర్షణీయమైన బహుమతులతో విక్రయములు జరుగును. పై పండుగలకు గ్రీటింగు కార్డులుగూడ మావద్ద వున్నవి



★

నిపుణులచే పెన్న - నేయితో కేకులు - బిస్కెట్లు - రొట్టెలు - మా వద్ద తయారగును.

★

కేకులలో సుందరమయిన రకాలు కొన్ని

ఆల్మండ్‌పేస్టు — పైనాపిల్ — ఫ్లవర్ బ్యాస్కెటు — ప్లాంటేషన్‌బంచ్
కస్టర్డు ఫ్రూట్ — డైమండ్‌ప్లేట్ — కోకొనైలు — స్పాంజ్ కేక్

డజను కేకులపెట్టె రూ. 3-00 * ఉచిత బహుమతులు 15-12-63 నుండి 15-1-64 వరకు

హౌస్‌హోల్డు బిస్కట్లు కిలో రూ. 4-50

క్రిస్‌మస్ - క్రొత్తసంవత్సరం - సంక్రాంతి పండుగల సందర్భమున

●●●● మా హృదయ పూర్వక అభివందనములతో ●●●●

క్రిందిచోట్ల తమ బహుమతులను స్వీకరించండి.

పూర్ణ క్యాంటీన్ — ట్రంకురోడ్డు. * ఆత్మకూరుబస్టాండు. * శ్రీరాం థియేటరు. *

పూర్ణబిస్కట్ ఫ్యాక్టరీ
సుబేదారుపేట - నెల్లూరు.
టెలిఫోన్ : 294.

## కెన్నడీ మరణానికి సంతాపాన్ని ప్రకటించడం అవమానకరమైన చర్య అట!

# రష్యన్లు అవునన్నది కాదన డమేనా ఎర్రచైనా పని?

అమరజీవియైన కెన్నడీ కాలధర్మం చెందినందుకు సంతాపాన్ని ప్రకటించడం 'అవమానకరమైన చర్య' యని ఎర్రచైనా ప్రతినిధులు వార్సా (పోలెండ్) లో జరిగిన ప్రపంచశాంతి మహాసభలో వ ల్క వ ం ఠంతొ మిందిన బోరకలి ఏమున్నది?

రష్యన్ల మీది కోపం ఎర్రచైనా వారికి ఎంతవరకు వచ్చిందంటే, వారు చెసని అన్నదానినల్లా తాము కాదనటమే పనిగా పెట్టుకున్నారు కాబోలు!

**ఇదీ లోకవృత్తం**

★★ లోకసంచారి ★★

ఆ సభలో రష్యన్లను ఎర్రచైనీయులు ఇంకొక విధంగా సవాల్ చేశారు. శాంతికి, సామ్రాజ్య విరుద్ధ ఉద్యమాలకూ ఎర్రటి వారు ముడిపెట్టినారు. ప్రపంచశాంతికై సహజీవనాన్ని సమర్థించే రష్యన్లు ఆ ఉద్యమాలను విసర్జించలేరుగాని, వాటిని తామై నడిపించేది లేదని అన్నారు.

తక్షణమే, 'ఛీ, పిరికిపందా! నీవేత గాకపోతే మేము లేమా? సామ్రాజ్యవిరుద్ధ విప్లవ వీరులారా! మిమ్మల్ని మేం నడిపిస్తాం పదండి' అని ఎర్ర చైనీయులన్నారు.

ఇదంతా లేనినిజం అని ఎర్రచైనా విర్ర వీగుడు! ఎంతటి అజ్ఞానమని ఆఎర్రచైనా?

ప్రపంచశాంతి సభ జరిగిన ఆ వార్సా వాకిట్లోనే లెనిన్ ఒకపాఠం నేర్చుకున్నాడు. అది మిలిటరీవేత్త మార్షల్ పిల్‌సడ్‌స్కీ పోలెండును పాలించేరోజులు, రష్యాలో కమ్యూనిస్టులచేతికి రాజ్యంరాగానే, ఆ రైతు కూలీప్రజా రాజ్యవాదుల ఘోషణాపత్రాలు విని, ఎక్కడి ప్ర జా వా హి ని యైనా సరే అంతావచ్చి ఎర్రజెండాకు సలాంచేస్తారని లెనిన్ వగైరాలు భావించారు. రష్యాసేనలు పోలెండులో చొరబడగానే ఆ సీమలోని రైతాంగం, శ్రామికజనం కలిసివస్తారని, సైన్యంలోవున్న రైతుబిడ్డలు, కూలీబిడ్డలు ఎదురు తిరుగుతారని, వారి సాయంతో పిల్‌సడ్‌స్కీ రాజ్యాన్ని ఒక్క నిమిషంలో ఎగరగొట్ట వచ్చునని వారి అభిప్రాయం.




41 ఏండ్లనాడు పంజాబునుండి పోయి అమెరికాలో స్థిరపడి, రైతుజీవితాన్ని గడుపుతూ, అచ్చట డెమొక్రటిక్ పార్టీవాడైన భారతీయరైతు దలీప్‌సింగ్‌తో కరచాలనం చేస్తున్న కీర్తిశేషుడు కెన్నడీ.

కాని, వార్సా నగర ప్రాంగణంలో పోలిష్‌సేనలు, ప్రజావాహిని రష్యావారి ఎర్రసేనలను ఎదిరించి తరిమికొట్టి పిల్‌సడ్‌స్కీ రాజ్యానికి జయజయధ్వానాలు పల్కినవి. అహో! జాతీయభావ ప్రభావం! ఇకమీద విప్లవాలను ఎగుమతి చేయరాదు! అని వెంటనే లెనిన్ ప్రకటించినాడు.

లెనిన్‌గాని, స్టాలిన్‌గాని విప్లవాలను ఎగుమతిచేసే పంథాను ఆ విమ్మట అవలంబించలేదు.

కాని, ఎర్రచైనాకు కావలసిందంతా ఏమిటంటే, రష్యానాయకులు చవటలని ఆఫ్రో-ఏషియా సీమలలోని ప్రజలకు రుజువు చేయడమే.

—తరువాయి 10 వ పేజీలో



## కీలర్‌కు మొగుడుకావాలట!

### ఇల్లాలుగా సుఖపడాలని కోర్కె!

బ్రిటిష్ యుద్ధమంత్రి శ్రీ ప్రొఫ్యూమో మహోజ్జ్వల జీవితాన్ని అంధకారంచేసి, తనను చేరదీసిన డాక్టరు స్టీఫెన్‌వార్డు జీవితాన్ని అర్పివేసి, 21 వ ఏటనే జగద్విఖ్యాతిచెందిన (దెబ్బ తప్పించుకొనే యనుకోండి!) క్రిస్టిన్ కీలరుకు ఇప్పుడు కనువిప్పు కలిగిందట. ఒక అందగాణ్ణి మొగుడుగాస్వీకరించి, ఇల్లు వాకిలి, పిల్లజల్లతో సుఖంగా జీవితాన్ని గడపాలని ఆమెకు క్రొత్తగా సంకల్పం గలిగిందట. పెళ్లయినవిమ్మట ఆమెకు లండన్‌లో వుండాలనే అభిలాష వున్నట్లులేదు; ఏ కుగ్రామంలో, ఏ అజ్ఞాత యూరోపియన్ పట్టణంలోనో, ప్రపంచానికి తెలియకుండా శేషజీవితాన్ని ఇల్లాలుగా గడపాలని ఆమె తలపోస్తున్నదట.

కాని ఇంత నీచమైన, హేయమైన జీవితాన్ని గడిపిన ఈ కులటను పెండ్లిచేసుకునేవాడెవడైనా వుంటాడా? ఒకవేళ వున్నా, ఎంతమందో జీవితాలను నాశనం చేసి, డాక్టరు వార్డును బలిగొన్న ఈమెకు సుఖశాంతులనేవి లభిస్తాయా? ఏమో, ఎవరు చెప్పగలరు? తన విషయాలన్నీ తెలిసిన ఒక సహృదయుడు తనను పెండ్లిచేసుకుంటాడని కీలర్ తన స్నేహితులకు చెప్పిందట; కాని అతని పేరు మాత్రం బయటపెట్టలేదట. అదిగాక, తన సుఖంకోసం, విలాసంకోసం పురుషులను పిచ్చివాళ్ళనుచేసి ఆడించి, ఆనందించిన ఈమె; తన శరీరాన్ని కోరినవారందరికి అమ్ముకున్నట్లే, జుగుప్సాకరమైన తన అంతరంగిక జీవిత విశేషాలను పత్రికలకు, చలనచిత్రాలకు అమ్ముకున్న ఈమె; శేషజీవితాన్ని సుఖంగా, సంతోషదాయకంగా గడపలేకుండా పోతుందా? మానవత్వమే మృగ్యమైన కీలర్ వంటివారికి లోకం ఏమన్నా, సంఘం ఏమన్నా చింత వుండదుగదా!

ఇంతకూ వార్డుకేసులో తప్పుడుసాక్ష్యం చెప్పినందుకు కీలర్‌కు లండన్ కోర్టు తొమ్మిదినెలలశిక్ష విధించింది. అందువల్ల పెళ్ళి, పిల్లలు, ఇల్లు సంగతి కీలర్ కృష్ణజన్మస్థానంనుండి వచ్చినతర్వాతనే ఆలోచించవలసివుంటుందేమో!

# ఇంటిదొంగలను సవరిస్తేగాని కాంగ్రెస్ సంస్థ క్షాళనంగాదు; దాని ప్రతిష్ఠ పెరగదు

నాల్గవ పంచవర్ష ప్రణాళికకై మనం సిద్ధంగావలసివచ్చేసరికి, ఇంతవరకు మనం సాధించిన ప్లానింగ్ లోపాలన్నీ బయటపడినవి. పరిపాలించే పక్షంలో తాము సాధించిందింతేనా అనే అంతరంగిక పరిశీలన ఎక్కువైనది. కటువుగా విమర్శించడానికి ప్రతిపక్షానికి ఆధారం దొరికింది.

మూడవ పంచవర్ష ప్రణాళిక ఫలితాలను పార్లమెంటుకు నివేదించిన ప్రభుత్వం ఆ నివేదనతోపాటు తన రాజీనామాలేఖను అందియ్యవలసి వుండెనని స్వతంత్రపార్టీ నాయకుడు మసానీ అనవలసి వచ్చింది. 'ఈ నెహ్రూ ప్రభుత్వంమీద ప్రజలకు కోపంవచ్చింది. ఈ ప్రభుత్వం నిరాయుధీగా వర్తిస్తుందని వారికి ఆశాలేశంలేదు. కాని, దీనిస్థానే ఎట్టి ప్రభుత్వం వస్తుందనే విషయంలో వారికేమీ తోచడంలేదు. ప్రజాస్వామిక విధానాలపై ఆశాభంగం, ముందేమి రానున్నదో తెలియని దుస్థితి ప్రవృత్తి ప్రజలందు వ్యాపించడం చూచి నేను వ్యాకులపడుతున్నాను' అని మసానీ తన వుపన్యాసాన్ని ముగించాడు.

మసానీ! నీకేకాదు ఎవరికీ ఏమీ తోచడంలేదు. కాని, నీవంటి ప్రాజ్ఞులు ప్లానింగనే ఎగరకొట్టి మిశ్రమ ఆర్థిక విధానం కావలెననడం, మన ప్లానింగ్ సోవియట్ రష్యా నమూనాలో వున్నదనడం సంకుచితమైన పక్ష దృష్టితో అనే మాటలుగాని, నీ హృదయంలోనుండి వచ్చినవా?

**వారం...వారం...**

**దేశద్రిమ్మరి**

కాంగ్రెస్ మహాసంస్థను కేవలం కమ్యూనిస్టు నమూనా త్రోవలోకి వెళ్ళకుండా కాపుదలచేయడానికి స్వతంత్రపార్టీ సామర్థ్యం అమోఘం. కాని, దేశానికింకొక అస్థిరతత్వ విచారం-ఒక కార్యక్రమం ప్రజలందరికీ ఆమోదమైనదానిని ఇవ్వడానికిదానిచేతకాదు. మిగిలిన సోషలిస్ట్ పార్టీలు (లోహియా పార్టీ తోసహా) కాంగ్రెస్ సోషలిజమును ఎగుడు దిగుడు లేకుండా సవరించగలవు అంతే. కమ్యూనిస్టుపార్టీ రెండుగాచీలి, అస్తవ్యస్తమై, ఒక పార్టీగా సజీవంగా వుండే నిమిత్తం అవిశ్వాసం పేరిట ప్రధాన మంత్రిని ఆశ్రయించివున్నది.

అటువంటప్పుడు 'ఈ నెహ్రూ ప్రభుత్వం'కాక, మసానీ, మనకు దిక్కెవ్వరు?

అట్లని ఈ నెహ్రూ ప్రభుత్వం ఎట్టి మార్పులులేకుండా యిట్లే కొనసాగిపోగలదని భావించడం పొరబాటు. ప్లానింగంటే జీవన్మరణ సమస్య. ఒక్కొక్కదశ దాటినకొలదీ, అది అనేక సమస్యలను తెచ్చి

—తరువాయి 10 వ పేజీలో


# సమస్యను అర్థంచేసుకోండి

అభివృద్ధికి, దేశరక్షణకు అవినాభావ సంబంధం వుంది.

ఫ్యాక్టరీలలోనూ, వ్యవసాయ క్షేత్రాలలోనూ ఎక్కువగా పండించిన కొలదీ దేశరక్షణకు మరింత బలాన్ని చేకూర్చుతూన్నారన్నమాట.

రక్షణశక్తి పెంపొందాలంటే స్థిరనిశ్చయముతో పనిచేయండి

DA 63/F 17

# గుంటూరు లేఖ

శిలానంద్

## ★ ఉపాధ్యక్షతకు వివిధ అభ్యర్థులు: అంకమ్మగారికే అధిక అవకాశాలు
## ★ క్రొత్త ఛెర్మెన్ ప్రక్షాళన కృషి
## ★ ఛెర్మెన్‌కుర్చీ మార్పు: ఒక కుంటివ్యాఖ్య

సిద్ధసంకల్పులైన చేబ్రోలు హనుమయ్యగారు సంకల్పసిద్ధులై గుంటూరు పురపాలక సంఘాధ్యక్షులుగా అత్యధిక మెజారిటీతో ఎన్నికగావడం ఎంతైనా సముచితంగా వుంది. అక్కసువచ్చలేని ప్రబుద్ధులుకొందరు యీ ఎన్నికపై, గోరంతలు కొండంతలుగా చేసి దుష్ప్రచారాలు కొడిగట్టినా, శ్రీ హనుమయ్య, అప్పుడే కార్యరంగంలోనికి దూకి గుంటూరు నగరాన్ని సుందరతరంగా ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని ఖ్యాతి ప్రణాళికలను సాధించే కృషిని చేపట్టారు. మంచినీళ్ళకు మొగంవాచిన గుంటూరు పౌరులపాలిట ఆయన భగీరథుడై మంచినీళ్ళ హనుమయ్యగా రాణకెక్కారు. ఎవరేమనుకొన్నా ఆయన సాధింపదలచిన దానివిషయంలో అకుంఠిత దీక్షతో జయప్రదంగా సాధింపగల్గిన ప్రజాహితైషి.

ఎన్నికల అనంతరం జరిగే కోర్టు తగాదాలు ఎన్నికల దావాలు, ఈఎన్నికల అనంతరంగూడా కొన్నికొన్ని వార్డులలో తలచూపినై. శ్రీయుతులు దావలి సూర్యనారాయణ, శ్రీ తిరుపతయ్య, శ్రీ లక్కరాజు సూర్యనారాయణగార్ల ఎన్నికలను సవాలుచేస్తూ కోర్టులో దావాలుపడినై.

ఇక వైస్‌ఛేర్మెన్ ఎన్నిక మరో రణరంగంగా తయారయ్యేటట్లున్నది. కులాలవారీగా, బ్రాహ్మణ, వైశ్య, తెలగ, వంశీయులు, శ్రీ దావలి సూర్యనారాయణ, శ్రీ తెల్లాకుల కోటేశ్వరరావు, శ్రీ శనక్కాయల అంకమ్మగార్లు వైస్‌ఛేర్మెన్‌ల జాబితాలో వున్నారు. ముస్లిములలో, అబ్దుల్ సలాం, మూసాగార్లు వున్నారు. శ్రీ హనుమయ్యగారుమాత్రం ఎటూ మొగ్గుచూపడం లేదు. మాజీశాసనసభ్యుడు, పురపాలక సంఘాధ్యక్షుడు, శ్రీ తెల్లాకుల జాలయ్య తన కుమారుని వైస్‌ఛేర్మెన్ చేయాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఇదిలా వుండగా తెలగ సంఘములలో అంకమ్మగారిని తప్పించి, ప్రతిపక్షంలోని విద్యావంతుడైన యువకుడు, శ్రీ అడపా చినవెంకటస్వామికి ఈ ఉపాధ్యక్షపదవి అంటుగట్టి ప్రతిపక్షీయులబలంగూడ అభ్యర్థుడు సంపాదించే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది. బ్రాహ్మణులలో శ్రీ దావలివారికిగాక, శ్రీ తెల్లాకుల కోటేశ్వరరావుకు ఉపాధ్యక్ష పదవి ఇస్తే, శ్రీ నడింపల్లివారి వాదనను అందించే అవకాశముంటుందని, మాజీ కౌన్సిలర్ శ్రీ వల్లమూడి గోపాలకృష్ణయ్యవంటి న్యాయవాదులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అందరూ అది అలాగ కలస్తవంటి పదవి అంటూనే, దానికే ఎగబడుతున్నారు. ఎక్కువ అవకాశాలు అంకమ్మగారికే కన్పిస్తున్నవి!

శ్రీ హనుమయ్యగారు ఛైర్మెన్ గావడంతోనే ఆఫీసు ప్రక్షాళన ఆరంభించారు. ప్రత్యేక అధికారుల పరిపాలన లోగుట్టుగాసాగిన అనేక వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నై. ఇటీవల కిరాణా చిల్లర వర్తకులు ఆరోగ్య శాఖాధికారులు చేస్తున్న అన్యాయార్జన, అందుకోసం వారవలంబిస్తున్న మార్గాలు సవిస్తరంగా చెప్పుకొంటే శ్రీ హనుమయ్యగారు ముక్కుమీద వేలువేసుకున్నారట. ఇక ముందు ఎలాంటి అన్యాయాలు ఈ ఆఫీసు సిబ్బందివలన జరుగకుండా చూడగలమని శ్రీ హనుమయ్యగారు హామీ ఇచ్చారట. గతంలోవలె అక్రమ విధానాలు జరుగకుండ వుండటానికై ఓ చక్కని పథకాన్ని సిద్ధంచేశారట!

పురపాలక సంఘమునకు సమీపంలో గల కీ॥ శే॥ కోమలాంగి స్మృతమూలో ఒక కార్యాలయం తెరచి అందులో ఒక ఉద్యోగిని నియమించి తత్సంబంధమైన ఫిర్యాదులు స్వీకరించి వానిని ఆయా వార్డుల కౌన్సిలర్లకు అందచేస్తారట.

ఇక లంచగొండి నేరారోపణలు, "అవినీతి నిర్మూలనశాఖ"కు అందచేసి వారిచే దర్యాప్తు చేయించే ఏర్పాటు గావించదల

—కొరవ 7 వ పేజీలో

# కెన్నెడీ హత్య

కవుల శోకం



## ఛీ ఛీ చైనా!

**శ్రీమతి సుంకర మాణి రామచంద్రరావు**

పిడుగుపడినయట్లు వడి ఘోరమగువార్త
జాను కెనడి హత్య జగముమీఁద;
దుఃఖమందుమునిఁగె దుర్మార్గ సన్మార్గ
భేదమింతలేక విశ్వమెల్ల.

కెంటఁజేరరేమొ తుంటరి చైనీయు
లార కున్నవారలారకొనక
వ్యంగ్యచిత్రమొండు వ్రాసి పత్ర్యారయందు
కులికినారు కెనడి తలనువ్రాల్చి.

అంతమాత్రమునకె అమరుఁడై వెలుఁగొందు
కెనడి గౌరవమ్ము తిలముగాదు;
ఒరుల గొప్పగాంచి ఓర్వనివారంత్రు
సిగ్గుమాలినట్టి ఛీని! నిన్ను.

ఇండియాకు సాయమీతఁడే; నేఁడది
తప్పిపోయెనంచు తలఁతువేమొ!
పొందవొటికమ్ము వడుసుగాక! తదాత్మ
మాకు ముందునిలిచి మాపు నిన్ను.

పుడమి జనములెల్ల వుక్కైదుఁబాన
గుండెలవియునట్లు ఘోషపెట్ట
స్నేహమెంచుఁగకుండ చెడమడ వాగేవు
చెదలఁబోలునట్టి చెత్త చైన!

లోకమంతయొకటి కాకుఁబోలేదు నీవ
యొక్కతైననేమి లెక్కమాకు?
కాక బ్రతుకులోన గడియించునే ఖ్యాతి
నీవుకూడనంతె నీచ చైన!

నీతిలోపిదుం డనింద్యచరిత్రుండు
సత్యవాది కెనడి సత్యజీవి
అట్టివాని శత్రువనుచుఁబోతు నీవు
బ్రదుకు బ్రదుకె? కుక్క బ్రతుకుగాక.

రాజహంసఁబోలి రత్నంబుగాఁబొల్చి
జారిపోయినట్టి జాను కెనడి
కనులలోనమెదలఁ గార్చిరి కన్నీరు
నీవు దావ నెవరు నింపఁబోరు.

—

## అమరజీవి

**సి హెచ్. నారాయణరావు**

మానవులందరొక్కటను
మానిత వర్తనలాదినుండియే
కానగవచ్చె, నేమయిరి,
గాంధియు, లింకను, క్రీస్తుదేవులుఁ
మానవసేవమెంచుటలో
మారణహోమమునైతిరిప్పు నీ
మానవతా నిరూపణము
మాన్యతనేమనవచ్చు కెన్నడీ.

జానిపలంతరాదిచట
జానినెవ్వరు మానవాళికిఁ
ఖానిపలన్న మాటలకు
భావము అల్పత, భేద దృష్టియుఁ
కానగవచ్చునందరకు
కావలె వారికి న్యాయధర్మముల్
మానవుడొక్క మానవుని
మానవుగా గన దోషమున్నదే.

తోటిమానవుల తన సోదరులుగాగ
చూడలేనట్టి మూర్ఖులజాడి మీరు
జానిసత్వము పోనోపి దాగుదలచ
దంపె లింకను, సూరేంద్రుడనియు,-నేడు
నిన్ను జంపిరి కెన్నడీ! నీతిలేక.

—

## ఆరని జ్యోతి

**దూబగుంట రామకృష్ణరావు**


వీరుడైన ఓ కెనడి
వీరస్వర్గము చేరుకుంటివా!
అజరిదివె
అవినీతిపరులను
అమరజీవివే
అమెరికా అధ్యక్షతలో.
ఈ భూమిని వదలితివే
ఇంతచిన్నవయసులోనె
స్నేహమెంనర్చితి, సాయముచేసితివి
మా హిందూదేశమునకు.
మరచిపోలేమోయి
మారని నీ ఖ్యాతి
అమెరికాకు నీ పదవి
అరనిజ్యోతి వీరనిఖ్యాతి
కదలిపోతివె
కనులకు కనబడక.

—


# దేశ రక్షణ



# దేశాభివృద్ధి



## రెండూ రెండు ముఖ్యాంగాలు

[illegible]



ప్రణాళికలతో ముందుకు సాగిపోదాము

దేశరక్షణ కృషికి ఇతోధికముగా తోడ్పడండి

DA 63/394



## టెండరు నోటీసు

కోవూరు తాలూకా, పెనుబల్లి పంచాయతీకి సంబంధించిన యీ క్రింద వివరించిన పనికి 30-12-1963 తేది సోమవారము మధ్యాహ్నము 3 గంటల వరకు సీల్డు టెండర్లు తీసుకొనబడును.

| పని వివరము: | ఎస్టిమేటు మొత్తము | టెండరు ధరావతు |
|---|---|---|
| పెనుబల్లి పంచాయతీ భవన నిర్మాణము చేయుట | రూ. 10,000/- లు. | రూ. 500/- లు. |

మిగత వివరములు - పెనుబల్లి పంచాయతీ ఆఫీసులో తెలుసుకొనవచ్చును.

—దొడ్ల లక్ష్మినర్సారెడ్డి,
ప్రెసిడెంటు - పెనుబల్లి పంచాయతీ.

11-12-63.

